# ఇన్విటేషన్

-శ్యామలాదేవి దశిక

ఆఫీసునుంచి ఇంటికి వెళ్తున్న సంధ్య అలవాటైన రోడ్డు మీద యాంత్రికంగా డ్రైవ్ చేస్తూ వివేక్, పిల్లలూ వచ్చేలోపు ఎన్నిపనులు చెయ్యొచ్చో ఆలోచిస్తున్నది. పిల్లలు ఇద్దరూ చిచింద్రీలు అంటే వివేక్ వాళ్ళను మించిన చిచింద్రీ! ఇంట్లో వుంటే చాలు ఏదో వంకతో సంధ్య చుట్టూ తిరుగుతూ సంధ్యను పని చేసుకోనివ్వడు. ఏమన్నా అంటే "ఎప్పుడూ నీ పక్కనే వుంటూ అన్నింట్లో సాయం చెయ్యాలని మా అమ్మ చెప్పింది" అంటూ అల్లరి మొదలుపెడతాడు! ముత్యాల్లాంటి పిల్లల్ని బంగారం లాంటి భర్తను తలచుకుంటూ సంధ్య తనలో తాను నవ్వుకుంది.

ఇంటికి రాగానే మైల్ మెయిల్ బాక్స్‌లో వున్న మెయిల్ తీసుకుని ఇంట్లోకి అడుగుపెట్టిన సంధ్య అర్జంటుగా ఓ కప్పు టీ తాగి పనులు మొదలు పెట్టాలనుకుంది. వేడివేడి టీ తాగుతూ రిలాక్స్ అవుతున్న సంధ్య దృష్టి టేబుల్ మీద తను పెట్టిన మెయిల్‌లో 'ఇన్విటేషన్' అని ప్రింట్ చేసిన కవరు మీద పడింది. వెంటనే జాగ్రత్తగా ఓపెన్ చేసి చూసింది. అది న్యూజెర్సీ తెలుగు కళాసమితి రజితోత్సవ ఆహ్వాన పత్రిక. నీలిరంగు కార్డు మీద మిలమిల మెరిసిపోతున్న వెండి అక్షరాలతో చక్కని డిజైన్‌తో చూడముచ్చటగా వుంది. కార్డుపైన సంధ్యకు ఎంతో పరిచయమైన కళా సమితివారి ముద్ర నీళ్ళపై తేలుతున్న వేయిరేకుల పద్మం, దాన్ని అంటి పెట్టుకుని వున్న విరిసీవిరయని మొగ్గ ఆ కార్డుకు మరింత అందాన్నిచ్చింది. ఈ ఇన్విటేషన్‌తో పాటు సంధ్యకు కళాసమితివారు ప్రత్యేకంగా రాసిన లెటరు కూడా అందులో వుంది. గబగబ తెరిచి చూసింది సంధ్య. ఆ లెటరు చదువుతున్న సంధ్య తన పనుల మాటే మర్చిపోయింది.

ఆ రోజు రాత్రి పక్క గదిలో పిల్లలు, పక్కన వివేక్ ఆదమరచి నిద్ర పోతుంటే, సంధ్య మాత్రం ఆ రోజు వచ్చిన ఇన్విటేషన్ గురించి, కళాసమితివారు తనకు రాసిన ఉత్తరం గురించి ఆలోచిస్తున్నది. సాయంకాలం నుంచి సంధ్య మనసంతా ఆ సంస్థ చుట్టే తిరుగు తోంది. తెలుగు కళా సమితి సిల్వర్ జుబ్లి సెలబ్రేషన్స్‌కు వివేక్, పిల్లలతో వెళ్ళి ఆ సంబరాల్ని అమ్మా నాన్నలతో, ఫ్రెండ్స్‌తో కలిసి పంచుకోవడానికి సంధ్య మనసు




ఉవ్విళ్ళూరుతున్నది!

ఆ తెలుగు సంస్థతో తనకు వున్న అనుబంధాన్ని తలచు కుంటున్న సంధ్య మనసులో తియ్యటి జ్ఞాపకాలు పరుచు కుంటున్నాయి -----------

పట్టుపరికిణీ వేసుకుని తోటిపిల్లలతో హాలులో పరిగెడుతుంటే కాళ్ళకు అమ్మ పెట్టిన పట్టాల మువ్వల చప్పుడు, గాజుల గలగలలు, జడగంటల గణగణలు సంధ్య తలపుల తలుపుని తెరవమంటున్నాయి.

స్టేజి మీద హడావిడిగా అటు ఇటు తిరిగే అంకుల్స్, టెస్టింగ్..వన్..టూ..త్రీ... అంటూ మైకులో వినిపించే తండ్రి గొంతు, స్టేజికి ఒక పక్కగా అమర్చిన దేముడి ముందు వెలిగించిన దీపాలు, అగరువత్తులు, ఆ పొగకు తనకు వచ్చే దగ్గు, చెప్పిన క్వాంటిటీలో అందరి దగ్గరనుంచి అన్నీ వచ్చాయో లేదో అని కంగారు పడుతూ, పుడ్డు దగ్గర ఫుట్ బాల్‌తో ఆడొద్దని అరిచే అపర్ణా ఆంటీ గొంతు సంధ్య జ్ఞాపకాల కిటికీలను తెరవమంటున్నాయి--------

పదేళ్ళవయసునుంచీ తను పాడిన ప్రార్థనా గీతాలు, చదివిన పద్యాలు, వేసిన కోలాటాలు, చేసిన

నృత్యాలు, పెద్దవాళ్ళచేత ఎలాగో ఔననిపించి నిర్వహించిన నాటకాలు, ఫాషన్ పెరేడులు ఒక్కక్కటే సంధ్య మనసుని తాకి సన్నని గిలిగింతలు పెడుతున్నాయి-----

తల్లి ప్రతిభ, తండ్రి తెలివి పుణికిపుచ్చుకున్న సంధ్య పాటైనా, పద్యమైనా, నాట్యమైనా ఇట్టే నేర్చుకునేది! ప్రాక్టీసు టైములో తనవంతు ఠకీమని చేసి తుర్రున పారిపోయేది. 'నువ్వు నేర్చుకుంటే చాలా? నువ్వు ఇలా కబుర్లాడుతుంటే వాళ్ళు ఎలా నేర్చుకుంటారు?' అని తల్లి కోప్పడగానే బయటకు వెళ్ళి మగపిల్లలతో కలిసి బాస్కెట్ బాల్ ఆడేది. రవి, సంధ్య మాట్లాడుకుంటూనే, ఓ పక్క ఆడుకుంటూనే అస్తమానం దెబ్బలాడుకునేవారు. ప్రాక్టీసుకోసం సంధ్య వేసుకునే జడ చూస్తే రవికి తగని చిరాకు. రవి ఎప్పుడూ పెట్టుకునే క్యాప్ అంటే సంధ్యకు ఒళ్ళుమంట! ఎవరూ చూడకుండా రవి సంధ్య జడలాగితే, రవికి తెలియకుండా అతని క్యాప్ దాచేసేది సంధ్య. ప్రతి ఫంక్షనుకు ముందు ప్రాక్టీసు పేరుతో పెద్దవాళ్ళు హైరాన పడుతూంటే, పిల్లలు మాత్రం పార్టీకి వెళ్ళినట్టు హాయిగా గడిపేవారు.

సంధ్య చురుకుతనం గమనించి, తను నేర్చుకున్నవి మిగతా పిల్లలకు నేర్పే బాధ్యత తల్లి సంధ్యకు ఇవ్వడం మొదలుపెట్టింది. ఆ తరువాత నెమ్మదిగా పోగ్రాము టైములో స్టేజి వెనకాలవుండి తండ్రికి సాయం చేసేది. ఒకసారి అంతకు ముందు ఫంక్షనులో ఎమ్ సీ గా చేసిన సుబ్బారావు అంకుల్ తెలుగు ఇంగ్లీష్ కలిపి ఎలా మాట్లాడాడో ఇమిటేట్ చేసి అచ్చు ఆయన మాట్లాడినట్టే ఇండియన్ యాక్సెంటుతో మాట్లాడి మిగిలిన పిల్లలందర్నీ నవ్వించింది. ఆ తర్వాత సంధ్య తల్లిదండ్రులు "ఈ సారి ఫంక్షనులో నువ్వు ఎమ్.సి.గా ఉండి ఎలా చెయ్యాలో చూపించు" అంటూ తను చేసిన తప్పుకు పనిష్మెంటు ఇచ్చారు. అమ్మా, నాన్నల ముందు ఓడిపోవడం ఇష్టంలేని సంధ్య దాన్ని ఛాలెంజ్‌గా తీసుకుని ప్రతి వాక్యాన్ని ఎలా పలకాలో నేర్చుకుని కంఠతాపట్టి చక్కని తెలుగులో మాట్లాడి అందరిని ఆశ్చర్యపరిచి సెభాష్ అనిపించుకుంది!

అలా సంధ్యకు తెలియకుండానే కళాసమితితో అనుబంధం పెరుగుతూ వచ్చింది. హైస్కూలు అయిపోయి కొలంబియాలో చదువుతూ కూడా సంధ్య తెలుగు కళాసమితి కార్యక్రమాల్లో పాల్గొంటూనేవుంది. వివేక్‌ని పెళ్ళిచేసుకున్న తర్వాత ఉద్యోగరిత్యా సంధ్య న్యూజెర్సీ వదలి బోస్టను వెళ్ళిపోయింది.

నిద్రలో ఇటు తిరిగిన వివేక్ ముఖం రూములో అలుముకున్న సన్నని వెలుగులో ఎంతో అందంగా కనిపించింది సంధ్యకు. ఈ వివేక్‌ని పెళ్ళిచేసుకోడానికి ఆనాడు తను సందేహించడం గుర్తొచ్చి సంధ్య నవ్వుకుంది. తోటి పిల్లల్లాగే తనకి తానుగా చూసుకుని పెళ్ళి చేసుకోవాలని వున్నా అప్పట్లో అలాంటి అవకాశాలు లేవని, వున్నా చాలా తక్కువ అని సంధ్యకు తెలుసు. అయినా ఎవడో ముక్కు మొహం తెలియని వాడిని చేసుకోనని సంధ్య మొండికేసింది. ఇండియాలో వున్న వివేక్‌ను వెళ్ళి కలవమంటే ఇక్కడవున్న వాళ్ళకు అక్కడవున్న వాళ్ళకు పొత్తుకుదరదని తల్లితండ్రులతో వాదించింది.

ఈ దేశానికి విజిటర్‌గా వచ్చిన వివేక్ తల్లి అనుకోకుండా తెలుగు కళాసమితి వారి ఫంక్షనుకు వచ్చి అక్కడ సంధ్యను చూసి ముచ్చట పడింది. సంధ్య సందేహాలు, భయాలు తెలుసుకున్న వివేక్ తల్లి సంధ్యకు తన కుటుంబం గురించి అన్ని వివరాలు చెప్పి 'మా అబ్బాయి మంచి చదువు, సంస్కారము, సరదా వున్నవాడే. కానీ మన పద్ధతులు సంప్రదాయాలు వంటివి వంటబట్టాలంటే మా వివేక్‌కు నీ లాంటి అమ్మాయి రావాలి. అందుకే ప్రత్యకంగా అడుగు తున్నాను" అంటూ సంధ్య బుజం తట్టి వెళ్ళారు. తల్లి సంధ్యతో "మన రాజ్యం పిన్నీ వాళ్ళు అక్కడే రెండిళ్ళవతల వుంటారు. ఓ రెండు నెలలు వుండి చూడు. అతను నీకు నచ్చకపోతే బలవంతం ఏమీలేదు" అంటూ నచ్చచెప్పి పంపించారు. ఆరు నెలలు తిరగకుండానే సంధ్య పెళ్ళి వివేక్‌తో జరిగిపోయింది!

వృత్తిపరంగా సంధ్యకు ఇన్విటేషన్లు, లెటర్లూ వస్తూనే వుంటాయి కానీ కళాసమితివారు పంపిన ఇన్విటేషను, ఉత్తరం సంధ్యకు ఓ ప్రత్యేక అనుభూతిని కలిగించాయి. ఇక్కడ పుట్టి పెరిగిన యువతరానికి ప్రతినిధిగా, కీనోట్ స్పీకర్‌గా తెలుగు కళాసమితి సంధ్యను ఆహ్వానించింది. కళాసమితి రజతోత్సవ సందరంగా సంస్థ స్థాపనకు, అభివృద్ధికి కారకులైన పెద్దవారిని గుర్తించడమే కాకుండా, సంస్థ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రభావితులైన యువతరాన్ని కూడా గుర్తించాలని ఉత్సాహపడుతోంది. వారికోసం ప్రత్యేకంగా విజ్ఞాన వినోద కార్యక్రమాల్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సంస్థతో పెరిగి పెద్దయి తమ జీవితాలను చక్కగా మలచుకొని ఎక్కడెక్కడో వున్న

యువతీ యువకులందరిని ఆ రోజు వేదిక మీదకు తీసుకు రావాలని తెలుగు కళాసమితి ఉబలాట పడుతోంది. వారి అభిప్రాయాలను, అనుభవాలను, వారి సూచనలతో పాటు భావితరానికి వారిచ్చే సందేశాలను వినాలని కళాసమితికి కుతూహలంగా వుంది!

ఆ ఉత్తరంలోని ప్రతి వాక్యము సంధ్య పదేపదే మననం చేసుకుంటున్నది. ఈదేశంలో ప్రవాసాంధ్రులు ఏ ఆశయాల్ని దృష్టిలో పెట్టుకుని ఇటువంటి సంస్థలు స్థాపించారో ఆ ఆశయాల ఫలితమే సంధ్యలాంటివారు అని తెలుగు కళాసమితి వారు ఆ ఉత్తరంలో అన్నారు. సంధ్యలాంటి యువత తెలుగు కళాసమితి కలలకు చిహ్నమని, వారి పాతికేళ్ళ పురోగతికి ప్రతిబింబాలని అంటూ తమ సంతోషాన్ని ప్రకటించారు. ఎన్నో విజయాలను సాధిస్తున్న ఈ యువతీయువకుల్ని చూసి సంస్థ గర్వపడుతోందన్నారు.

కళాసమితికి తన తరం పట్లవున్న అభిమానానికి, గౌరవానికి వుప్పొంగిపోయినా, సంధ్యకు తెలుసు ఈ విజయం పూర్తిగా తమది కాదని. తమని పెంచి పెద్ద చేసిన అమ్మా నాన్నలతో పాటు ఈ సంస్థకు కూడా తమ విజయంలో భాగం వుంది. మనిషి జీవితం సాఫీగా నడవడానికి కావలిసిన మంచి లక్షణాలను ఎన్నో ఈ సంస్థ ద్వారా నేర్చుకున్నారు, సంధ్యలాంటి పిల్లలు. పక్కవారికి సాయపడటం, నలుగురితో కలసి పని చేయడం, పరిస్థితులకనుగుణంగా సర్దుకు పోగలగడం, జీవితంలో వచ్చే మార్పుల్ని ఒడిదుడుకుల్ని తట్టుకుని ముందుకు వెళ్ళగలగటం ------- ఇలా ఎన్నో ఈ సంస్థ నేర్పింది. తను ఎక్కడినుంచి వచ్చిందో చెప్పి, తన భాషా సంస్కృతిని నేర్పి తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపింది. సంఘంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి చేయూత నిచ్చింది. ఎదిగే వయసులో పక్కదోవలు పట్టకుండా ఈ సంస్థ తనను కాపాడింది.తను ఒక చక్కని యువతిగా, భార్యగా, తల్లిగా, ఉద్యోగస్తురాలిగా, గృహిణిగా రాణించడానికి వెనుక తెలుగుకళాసమితి పేరుతో ఏంతోమంది వున్నారని 'It takes a village to raise a child'లో అర్థాన్ని సంధ్య పెద్దైన తర్వాత తెలుసుకుంది.

కళ్ళమీదకు నెమ్మదిగా నిద్ర వస్తున్న సంధ్య ఈ దేశంలో మా తరం ఇంత అందంగా ఆరోగ్యంగా వుండటానికి కారణం ఇలాంటి సంస్థలే, నిజానికి మేమే ఈ సంస్థలకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి అనుకుంటూ హాయిగా నిద్రలోకి జారుకుంది. ******

## నువ్వు



- *డా. వైదేహీ శశిధర్*

ఇంకాస్సేపట్లో నిద్రలోకి జారిపోయే లోపు
మరో సౌగంధికా పుష్పాన్ని
నా జడలో తురుముతావు!

బాధల, భయాల ముళ్ళచెట్లక్రింద విశ్రమించిన
రోగుల గాయాలపై ఆరోగ్యపు లేపనాన్ని అద్దటంలో
రోజంతా అలసిపోయి కొంచంసేపు నిద్రాసౌఖ్యాన్ని
దుప్పటిలా కప్పుకుందామనేసరికి
నిండుగా పూచిన మరో పారిజాతపు పాదని
మన ముంగిట్లో నాటుతావు!

బాధకీ, ఉపశాంతికీ, ఆశకీ, నిరాశకీ
మధ్య ఊగిసలాడే నా పేషంట్లని
ఆరోగ్యపు తీరానికి చేర్చటానికి
సాయంత్రం వరకూ సరంగునై తిరిగి తిరిగి
కొంచంసేపు కలలు కూడా లేని నిద్రను
మేలిముసుగులా కప్పుకుందామంటే
నిద్రించిన నా స్వప్నాలన్నింటినీ
పున్నాగ పూలగుత్తులుగా మేల్కొల్పి
ఓ గాఢమైన పరిమళ ప్రవాహంలో
నన్ను ముంచివేస్తావు ! !